

అందమైన చుక్కల చీకటి చీరను, ఆకాశం సింగారించుకొంటుంది- లారీలు, సైకిళ్ళు, కార్లుచేసే రణ గొణ ధ్వనుల మధ్య.

నెమరువేసుకుంటున్న ఆలోచనలు స్మృతికి వస్తుంటే నిదుర మండి లేచింది- మల్లె పువ్వులాంటి మల్లి గుడిసెలో. గుడిసెమీద తాటి రేకులు, పిచ్చిగాలిలో దెబ్బలాడి రెక్కలు తెగిన పక్షుల్లా విలపిస్తూ, గుడిసెలో ఆక్రమిస్తున్న చీకటి రేఖలను నిస్సహాయంగా చూస్తున్నాయి. దినం అంతం కాగానే, మల్లికి బ్రతుకులాంటి జీవితం

# బ్రతుకు కొండచిలువ




ప్రారంభమవుతుంది. చీకటి మల్లి జీవితంలో చైతన్యం. ఎవరికోసం బ్రతుకు? యెందుకోసం బ్రతుకు? కోడిగుడ్డు లాంతరులో చమురు పోసింది, తెలియని ఆశల్ని గుండెలో నింపుకొని. మురికి వాసన, ప్రత్యక్ష నరకంలా వుండే సందులో ఆ చిరు గుడిసెలో, దీపం-వర్షంలో ఒణుకుతున్న కోడిపెట్టలా వుంది. అక్కడే రాత్రి కాటుక దిద్దుకున్న తరువాత, నాగరికత, కోరిక, కాంక్ష, సంస్కారం దొంగతనంగా ప్రవేశిస్తాయి.

మల్లి నలిపేసిన మల్లెపూవులా

వుంది. శరీరం తప్పించి నాదీ అనే వస్తువుల్లేవు. ఆకలి కడుపును రగిలించేస్తోంది. దగ్గర్లోనే టీ దుకాణం.

"టీ.... యియ్యి." నీరసంగానే అడిగింది. రొట్టెలు అందంగా గాజు పెట్టెలో నుండి వెక్కిరిస్తున్నాయి.

"నిన్నటికే అయిదు రూపాయిలయింది" అన్నాడు ప్రొప్రయిటర్ కమ్ సర్వరు.

"తెలుసు. ఈ పొద్దు కొత్త సినీమా బేరం తగులుద్ది. కాసేపటి కల్లా తీరిసేస్తాను" అంది మల్లి చిరునవ్వు ముఖాన అతికించుకొని.

"రెండు రోజులయింది, రెండు టెర్లిన్ చీరలట్టుకెళ్ళావ్. అద్దె డబ్బు ల్లేవు. గుడిసె అద్దె డబ్బు యివ్వ నేదట, చీరలూ లేవు. యేటి తమాసా సేస్తున్నావా?" అడిగాడు వీరయ్య-లాండ్రీ కొట్టు యజమాని, అప్పుడే టీ తాగటానికి వచ్చి, ఆమె కట్టుకున్న టెర్లిన్ చీర వంక చూస్తూ.

"లేదు ఈరయ్య మావా! రేపట్టుకొచ్చి యిస్తాలే" అంది కులుకుతూ.

టీ త్రాగిన తర్వాత మల్లి కళ్ళలో కాంతి వచ్చింది. నిలబడడానికి శక్తి వచ్చింది. ఎవరో రోడ్డు మీద స్త్రీ, చంటిపాపను యెత్తుకుని, భర్త ప్రక్కనే నడుస్తూ కబుర్లు చెప్పుకుంటూ సినీమాకు త్వర త్వరగా పోతోంది. అందంగా వుందా పాప. మల్లి కళ్ళలో నీరు తిరిగింది. తనూ అలానే వుండాలనుకుంది. కాని యింకోలా జరిగింది. దుర్భర దారిద్ర్యం, తండ్రి బ్రాకెట్లాట తన సీ స్థితికి తెచ్చింది. తండ్రి పోయినా అతనికి వారసురాలుగా మిగిలిపోయింది. సుదీర్ఘ ప్రశాంత నిరీక్షణ చాలా సేపు. బ్రతుకుటాశల రెక్కలు తెగిపోతున్నాయి. పౌడరులో కలిపిన మైదా. ఆమె కడుపులో రగులుతున్న ఆకలిలా, చల్లదనానికి, ముఖానికి అతుక్కుపోయింది. కళ్ళలో ఓపిక, కాళ్ళలో సత్తువ దిగజారిపోతోంది. మల్లికి, రక్కన యెర్ర సైకిలు టోపి ఆగింది. ధర్మాన్ని రక్షించాల్సిన చెయ్యి జీవనధర్మం దగ్గర పయికం కోసం చెయ్యి చాచింది.

"ఇంకా బోణీ నేదు. కావాలంటే సూసుకో" మల్లి నవ్వింది. నవ్వు కాదు అది మంట. అనుమానంగానే సైకిలు కదిలింది యింకో గుడిసెకు. యింకెవరూ రారనుకున్న నిరాశ చీకట్లో, ఎర్రగా సిగరెట్టు వెలుగు. మండుతున్న కోరిక, మల్లి గుండెల్లో సన్నని వెలుగు.

తలుపులు మూతబడ్డాయి. కోడి గట్టిన దీపం ఏలవంతంగా ఆర్పి వేయబడింది. ఆ చీకట్లోనే నోటు, ఆమె గుండెల మధ్యగా వుంచ బడింది.

మల్లి శరీరం అతని చేతిలో కీలుబొమ్మయింది.

"నేనీ వూరొచ్చాను వ్యాపారం పనిమీద. నువ్వందంగా వున్నావు. నాకు నచ్చావు. నేను నిన్నుంచు కుంటాను. నాకు చాలా డబ్బుంది. రేపుదయం మెయిలుకితీసికెళతాను. నీకిష్టమేనా?" అతని ప్రశ్న. మల్లి మనస్సులో అమృతం కురిపించింది. ఆనందంతో మాట్లాడలేకపోయింది.

"యేం నమ్మవా? ఆ దేవుడు తోడు.... పెండ్లి చేసుకోను, నిన్ను నేను వుంచుకుంటాను" అన్నాడు మల్లిని మళ్ళీ దగ్గరకు తీసుకుంటూ. కలలు గంటూ, తృప్తిగా అతని శరీరానికి అతుక్కు పోయింది మల్లి యీసారి.

మల్లికి తెలివొచ్చే సరికి [illegible] ట్లన్ని దాస్తున్న నిజంలాంటి వెలుగు రేఖలు- గుడిసె సందుల గుండా వెలుగు నింపుతున్నాయి.

"దరిద్రం— ఈ రోజుతో సరి" అనుకుంది మనస్సులో. చుట్టూ చూసింది. యెవ్వరూ కని పించలేదు. బహుశా పెరట్లోకి వెళ్ళే



డేమో. తనలోనే నవ్వుకొని చీర కోసం చూసింది- చీర లేదు. అద్దె చీర మాయమయింది.

బ్రాలో వున్న, అతనిచ్చిన నోటు చూసింది. అది పరాయి దేశం నోటు. మల్లికి నిద్రమత్తు కలలు అన్నీ భస్మమై పోయాయి.

"నేనేటి తప్పు చేశాను దేవుడో నాకీ నెప్పి" అని నెత్తి కొట్టు కుంది గోడకు. గోడకు చిరిగి పోయిన దేవుని కేలండర్‌ను. గుండెల కడ్డంగా పెట్టుకొని.

గుడిసె కన్నంలోనుండి ఆకాశం గుండెలో మండుతున్న యెర్రని గాయంలాంటి సూర్యుడు 'వెలుగు చీకటేలలను కన్నది ప్రకృతు దాగిలి మూతలా' అన్న నిజాన్ని చాలకబోస్తూ .... ప్రయా ణిస్తున్నాడు.

మల్లి చెల్లించాల్సిన బాకీల డబ్బు సమస్య — ఆమెను కబళించాలని కొండ చిలువలా సిద్ధంగా వుంది. *